




వెలుగు దివ్వేలు



- లోకల్ మేడ్ ప్రమిదలకు క్రేజ్..
- మార్కెట్‌లో వెరైటీ డిజైన్లలో అమ్మకాలు
- సిరిసిల్లలో మొదలైన వెలుగుల పండుగ
- చిరు వ్యాపారులకు ఉపాధి



సిరిసిల్లటౌన్: దీపావళి పండుగ పూట కారు చీకట్లు పారదోలే వెలుగు దివ్వెలు చిరువ్యాపారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. మూడురోజుల్లో పండుగ సమీపిస్తుండటంతో సిరిసిల్ల మార్కెట్‌ను మట్టి దీపాలు ముంచెత్తాయి. స్థానికంగా మట్టితో తయారయ్యే అందమైన ప్రమిదలకు మరింత క్రేజ్ పెరిగింది. మైనంతో తయారయ్యే దీపాలు కాకుండా మట్టి ప్రమిదలను ప్రజలు కోరుకుంటున్నారు. దీంతో మట్టితో పాత్రలు తయారు చేసే కుమ్మరులు.. చిరు వ్యాపారులకు దీపావళి సీజన్ కలిసొస్తుంది. కొందరు వ్యాపారులు డిమాండ్‌కు తగ్గట్టుగా ఇతర ప్రాంతాల నుంచి వెరైటీ డిజైన్లలో ఇంపోర్టెడ్ ప్రమిదలనే తెప్పిస్తున్నారు. వ్యాపారుల్లో మట్టి దివ్వెలు ఉపాధి వెలుగులు నింపుతున్న వైనంపై కథనమిది..

సీజనల్ ఉపాధి..

కార్తీకమాసంలో హిందువులు ఇంటి ముందు దీపాలు పెట్టడం ఆనవాయితీ. సంస్కృతి, సంప్రదాయపరంగా మట్టితో తయారయ్యే ప్రమిదలనే ప్రజలు కోరుకుంటున్నారు. మైనం దీపాలతో గతంలో ఆదరణ కోల్పోయిన మట్టి ప్రమిదలు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో మళ్లీ వినియోగం పుంజుకుంది. నెల రోజులుగా సిరిసిల్లలోని పది కుమ్మరుల కుటుంబాలు ప్రమిదలు, కంచులు, కుండల తయారీతో బిజీగా ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి, కోనరావుపేట, ఇల్లంతకుంట మండలాల నుంచి ప్రజలు వచ్చి సిరిసిల్లలోని కుమ్మరుల వద్ద మట్టి పాత్రలు కొనుగోలు చేసేందుకు సిరిసిల్లకు రావడంతో మార్కెట్‌ను మట్టిపాత్రలు ముంచెత్తాయి. ఇంటిముందు, వాకిళ్లలో దీపాలు వెలిగించడానికి మహిళలు ఇష్టంతో ప్రమిదలను కొనుగోలు చేయడంతో మార్కెట్‌కు పండుగ శోభ సంతరించుకుంది.

వెరైటీల్లో డిజైన్లు..

ప్రజలు ఇంటిని దీపాలతో అందంగా అలంకరించుకోవడానికి, భక్తితో నోములు, వ్రతాలు ఆచరించుకోవడానికి మట్టితో తయారైన అందమైన మట్టి ప్రమిదలు వెరైటీ డిజైన్లలో లభిస్తున్నాయి. దీపావళి నేపథ్యంలో సిరిసిల్లకు రాజస్థాన్, నాందేడ్, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రమిదలను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు. నీటిలో తేలియాడే ప్రమిదలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మట్టితో తయారు చేసిన ప్రమిదలు డజన్‌కు రూ.100 నుంచి రూ.400, ఫైబర్‌తో తయారైన ప్రమిదలు జతకు రూ.150 రేటు పలికాయి. సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్, పెద్దబజార్, అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ప్రమిదల కొనుగోళ్ల సందడిగా మారింది.

దీపావళి రోజు ప్రతి ఇంట్లో వెలిగించే దీపాలను తయారీదారులు వెరైటీ డిజైన్లలో తయారు చేశారు. ఫైబర్, మట్టితో పాటు వివిధ రకాల లోహాలతో తయారైన ప్రమిదలు మార్కెట్‌లో ఆకర్షణగా నిలిచాయి. మూడురోజుల్లో దీపావళి జరుపుకుంటున్న ప్రజలు రెండ్రోజులు ముందుగానే దీపావళి పూజాసామగ్రి, ప్రమిదలు, కొవ్వొత్తులు, నూనెలు కొనే పనిలో పడ్డారు.

ఆన్‌లైన్ డిజైన్లతో అమ్మకాలు



ఆన్‌లైన్ ద్వారా డిజైన్లను చూసి ఆర్డర్‌పై తీసుకొచ్చి అమ్ముతాం. కార్తీకమాసంలో మట్టి పాత్రలకు గిరాకీ బాగా ఉంటుంది. రాజస్థాన్, హైదరాబాద్ నుంచి వెరైటీ డిజైన్లలో ప్రమిదలు తీసుకొచ్చాం. ప్రజలు మైనం దీపాలు కాకుండా సంప్రదాయమైన మట్టి ప్రమిదలు, కుండలను వినియోగించడం మూలంగా మాకు ఉపాధి బాగా దొరుకుతుంది. ఈఏడాది అమ్మకాలు పర్వాలేదు. పదహారేళ్లుగా ప్రమిదలు అమ్ముతూ ఉపాధి పొందుతున్నా.

– మంచర్ల స్వరూప, చిరువ్యాపారి

మట్టి దీపాలనే అడుగుతుండ్రు..



ప్రజలు మట్టితో తయారు చేసిన దీపాలే అడుగుతున్నారు. ప్రజలు కోరే వెరైటీ డిజైన్లలో ప్రమిదలు తయారు చేస్తున్నాం. కొన్నేళ్ల నుంచి సంప్రదాయబద్ధమైన మట్టి దీపాలకు డిమాండ్ పెరిగింది. చెరువుల్లో మట్టిని తెచ్చి దీపాలు, ఇతర పాత్రలను తయారు చేస్తున్నాం. మా కుమ్మరులకు సర్కారు, కరెంటు సారీలు (పాత్రలు తయారు చేసే మిషన్), ప్రెసింగ్ మిషన్లు అందించాలి. చెరువుల్లో మట్టిని ఉచితంగా తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలి.

– అన్నారం లక్ష్మి, శివనగర్

క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన సంగీతం



మహేశ్‌కుమార్ గౌడ్‌తో సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను శనివారం టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ కలిశారు. ఢిల్లీలో బీసీ గణన, పార్లమెంట్‌లో 50శాతం రిజర్వేషన్లు, తదితర అంశాలపై కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీపీసీసీ ప్రెసిడెంట్‌ను సంగీతం శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నారు.

సప్తాహం ప్రారంభం



ప్రవచనాలు వినిపిస్తున్న మేఘరాజ్‌శర్మ

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో దువ్వ శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం సప్తాహం ఏర్పాటు చేశారు. ఫణతుల మేఘరాజ్‌శర్మ శ్రీ మద్భాగవత సప్తాహ ప్రవచనములు వినిపించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నారాయణ

బోయినపల్లి: రాష్ట్ర అంబేడ్కర్ సంఘం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొత్తపేటకు చెందిన మానాల నారాయణ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన సంఘం వ్యవస్థాపకుడు గజ్జెల కాంతం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుద్దాల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్‌కు నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన వారికి ‘డబుల్ ’ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడఅర్బన్: నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలని నియోజకవర్గ సీపీఐ పార్టీ ఇన్‌చార్జి కడారి రాములు అన్నారు. వేములవాడలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుపేదలకు ఇళ్లు అందించాలన్నారు. అలాగే మూలవాగు పక్కన ఉన్న కూరగాయల మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నాయకులు గాజుల పోశెట్టి, శ్రీరాములు, నర్సయ్య, క్రాంతి తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

బోయినపల్లి: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఎస్ ఎస్–9 ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలపడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సెస్ ఏఏఈ ప్రశాంత్, సంపత్‌రావు, రమేశ్ రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: దుమాలలో ఇటీవల పెరుమండ్ల మల్లేశం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గ్రామస్తులు రూ.57వేల ఆర్థికసాయంగా అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

‘భగీరథ’ పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి స్పందన

వేములవాడరూరల్: మిషన్ భగీరథ నీటిలో ×భగీరథ నీరు కలుషితం॰ అనే శీర్షికన ఈనెల 25న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మిషన్ భగీరథ ఏఈ అభిషేక్ పైప్‌లైన్ మ రమ్మతులు చేపట్టారు. బొల్లారంలో పైప్‌లైన్, వేములవాడ పట్టణంలో కలుషిత నీరు రావడాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టారు.

అనుమతులు మంజూరు

తంగళ్లపల్లి: మండలంలోని కస్బెకట్కూర్‌లో గ్రాపంచాయతీ అనుమతులు లేకుండా రెండు అంతస్తుల భవనం నిర్మించారని తెలుపుతూ సాక్షి వాట్సాప్ పేరుతో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ స్పందిస్తూ గ్రామానికి చెందిన బొమ్మ వరం శోభారాణి భర్త కమలాకర్‌రావుకు పలసార్లు షోకాజ్ నోటీసులు ఇవ్వగా ఈనెల 25న ఇంటి అనుమతి కోసం, అర్జీపెట్టుకున్నారని, నిర్మాణ ఫీజు తీసుకుని భవన నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

‘కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు’



మాట్లాడుతున్న మాట్ల మధు

తంగళ్లపల్లి: కొందరు కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పోస్టులు సాధించాలనే ఉత్సాహంతో తప్పుడు ఆరోపణలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపారని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ నాయకులు కొయ్యడ రమేశ్, గుండ ప్రేమ్‌కుమార్, అమర్ రావు, నక్క కొమురయ్య, చెన్నమనేని రాజేశ్వరరావు, గుగ్గిళ్ల నరహరి, మంకంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం



వేములవాడరూరల్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఎస్పీ, కలెక్టర్

వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్లలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. వేములవాడ రూరల్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో దాదాపు 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన టీచర్ ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి రక్తదానం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి రక్తదానం చేయడం ఇది 19వ సారి. వీరిని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా,ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఏఎంసీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న హన్మండ్లు

గంభీరావుపేట: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. మండలంలోని శ్రీగాధలో ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్‌రావును శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మండ్లు మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతామన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, తెల్లరేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నాయకులు బండెల రాజు, రంగారావు, కాశాగౌడ్, యాదాగౌడ్, అకారపు కాశీ,శ్రీనివాస్‌గౌడ్, పర్శ శ్రీ నివాస్, నర్సింలు, సంజయ్య, తిరుపతిరావు, మో హన్‌రా వు, గణేశ్, నర్సింగారావు, పర్శాగౌడ్, రాములు, దే వరాజు, రవి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపుపై విచారణ చేపట్టండి

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయ హుండీ లెక్కింపులో నగదు అపహరణపై లోతైన విచారణ చేపట్టాలని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పోలీసులను కోరారు. ఇటీవల హుండీ లెక్కింపులో కాంట్రాక్ట్ ఉద్యోగి నగదును అపహరించే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే. సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించారు.

సంక్షిప్త వార్తలు

● **రాజన్న ఆలయ ఉద్యోగికి పదోన్నతి**

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సగ్గు దిలీప్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఉత్తర్వులను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్, అశోక్, పర్యవేక్షకుడు విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు పురాణం వంశీ, తదితరులు పాల్గొన్నారు.

● **ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలి**

వేములవాడఅర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. హరేందర్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

● **రక్తదానం చేసిన యూత్ నాయకులు**

తంగళ్లపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సాల్లో భాగంగా శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో తంగళ్లపల్లికి చెందిన పలు పార్టీల యూత్ నాయకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పోలీస్ వారి నుంచి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు భరత్ గౌడ్, కూర ప్రణయ్, రంగు తిలక్, సందీప్, రాము, ముద్రకోల లోకేశ్, ముకేశ్, నవీష్, ప్రేమ్ పాల్గొన్నారు.

● **దళితుడు చైర్మన్‌గా ఉండడం ఇష్టం లేదా?**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ పదవిపై కొన్ని రోజులుగా నంది కిషన్, సందుపట్ల లక్ష్మారెడ్డి అనవసరమైన చర్చకు దారితీస్తున్నారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. దళితుడు చైర్మన్ కావడంతోనే నంది కిషన్, సందుపట్ల లక్ష్మారెడ్డి జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ఆలయ కమిటీ చైర్మన్‌గా గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్‌గా గంట వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం గుర్తుచేశారు. చైర్మన్ పదవికాలం రెండేళ్లు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నీరటి భూమరాజం, గుమ్మడి రామస్వామి, నర్సయ్య, శంకర్, కొత్త చెన్నయ్య, ఆనందం, లింగాల దాసు, కొత్త మల్లయ్య, గడ్డం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన**

వేములవాడఅర్బన్: వనపర్తి జిల్లా కొత్తపేట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్ జయరామ్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు వార్డు ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మల్లారం అర్జున్ అన్నారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు వార్డుఆఫీసర్లు నిరసన తెలిపారు. ఆంజనేయులు, పర్శరాములు, వేణు, సుధీర్, రహీం, రాజేందర్, రాజేశ్, మంజుల, తదితరులున్నారు.

● **ఉపాధి పనులపై గ్రామసభ**

రుద్రంగి: గ్రామ పంచాయితీ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పనుల గుర్తింపునకు శనివారం గ్రామసభ నిర్వహించారు. అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు గ్రామంలో ఉన్న పనులపై చర్చించారు.

● **తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు**

గంభీరావుపేట: మండలంలోని నర్మాలకు చెందిన బండిరాములు అనారోగ్యంతో మృతిచెందాడు. రాములుకు కొడుకులు లేపోవడంతో కూతురు పున్నమ్మ ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రికి కూతురు తలకొరివి పెట్టడం పలువురిని కంటతడి పెట్టించింది.

● **చికిత్స పొందుతూ మృతి**

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయ రిటైర్డ్ పర్యవేక్షకుడు వెలిచాల రామచందర్‌రావు (65) శనివారం మృతిచెందారు. ఐతుపల్లి గ్రామానికి చెందిన రామచందర్ రాజన్న ఆలయంలో టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరి పదవి విరమణ పొందారు. కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య శైలజ ఇద్దరు కుమారులున్నారు.

● **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

వీర్నపల్లి: మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అడవి పదిరకు చెందిన ఎడ్ల లచ్చయ్యకు రూ.55వేలు, లాల్‌సింగ్ తండాలో భూక్య రజితకు రూ.16వేలు, జవహర్ లాల్ నాయక్ తండాలో తరుణ్‌కు రూ. 21,500, వన్‌పల్లికి చెందిన రాజయ్యకు రూ. 60వేల విలువైన చెక్కులను అందజేశారు.

● **పాఠశాల అభివృద్ధికి విరాళం**

చందుర్తి: మల్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పత్తిపాక తిరుపతి రూ.25వేలు అందజేశారు. తిరుపతి తండ్రి పెద్ద దేవరాజు, మిత్రులతో కలిసి ఉపాధ్యాయులకు అందజేశారు.



బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లిలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల బాధతో రైతులు కూరగాయల పంటలు సైతం వేయడం లేదు. ఇటీవల ఓ రైతు కోతుల దాడినుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. అధికారులు కోతుల బెడద నుంచి కాపాడాలి.

– ఇరువాల మహేందర్, వెంకట్రావుపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: ఐలయ్య
పంచాయతీ కార్యదర్శి, వెంకట్రావుపల్లి, సెల్ నంబర్: 9515624127

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

మాలల ఆత్మీయ సమావేశానికి తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

గంభీరావుపేట: ఈనెల 27న సిరిసిల్లలో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి మాలలు అధికసంఖ్యలో తరలిరావాలని జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కోరారు. ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం గ్రామస్థాయి నుంచి అభిప్రాయ సేకరణ, భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు మల్యాల రాజవీర్, ఎగదండి స్వామి, ఎడబోయిన రాజు, బండ రమేశ్, మండల అధ్యక్షులు గన్నే నాగరాజు, నాయకులు రవి, శేఖర్, శ్రీధర్, అర్జున్, అరుణ్, సతీశ్, ధర్మేందర్, ధన్‌రాజ్, రామస్వామి, హరీశ్‌రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



ఎల్లారెడ్డిపేట: ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గంభీరావుపేట: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల భవిష్యత్ మారడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కల్యాణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ భూపతికి వినతిపత్రం అందించారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, నాయకులు అవినాష్, ప్రణయ్, తరుణ్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, నాయకులు రాకేశ్, సాత్విక్, ప్రణయ్, సాయి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బోయినపల్లి: దుండ్రపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ కిషన్‌రెడ్డి

బోయినపల్లి: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని కోరెం సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సింగిల్‌విండో పరిధిలోని మల్కాపూర్, దుండ్రపల్లి, కోరెంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పెండ్యాల కిష్టారెడ్డి, అనుపట్ల తిరుపతిరెడ్డి, యూవీ.లక్ష్మారెడ్డి, పులి హన్మాండ్లు, డబ్బు రాధ వెంకటరెడ్డి, మొగిలిపాలెం నర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ. బాబు, రోమాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో టీవీ తారల సందడి



విశాల షాపింగ్ మాల్‌లో టీవీ తారలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో శనివారం బుల్లితెర నటీమణులు సందడి చేశారు. స్థానిక విశాల షాపింగ్ మాల్‌కు వచ్చి సందడి చేశారు. చీరలు చూస్తూ..అక్కడున్న అభిమానులతో ముచ్చటించారు. తారలతో ప్రజలు సెల్ఫీలు తీసుకున్నారు. తమ షాపింగ్ మాల్‌ను విజిట్ చేసిన తారలకు యజమానులు వేముల విష్ణు, నాగరాజులు గిఫ్ట్ హ్యాంపర్స్‌ను అందించి కృతజ్ఞతలు తెలిపారు.

‘పారిశుధ్యం లోపించకుండా చర్యలు’

సాక్షి స్పందన

వేములవాడఅర్బన్: పట్టణంలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నట్లు వేములవాడ మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి అన్నారు. ఇటీవల సాక్షిలో ‘కంపుకొడుతున్నాయి’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ మున్సిపల్ పరిధిలోని 21ఆటోలు, 6 ట్రాక్టర్లతో రోజుకు 20 టన్నుల చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వపరంగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఎల్లారెడ్డిపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ కొమిరిశెట్టి తిరుపతి, నాయకులు దయాకర్‌రావు, రాజేందర్, బాల్యానాయక్, విఠల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

● **ఆర్థికసాయం అందజేత**

కోనరావుపేట: వట్టిమల్లలో 25ఏళ్లుగా పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసిన భూంపెల్లి పోశవ్వ మృతిచెందింది. బాధిత కుటుంబానికి గ్రామపంచాయతీ తరఫున రూ. 10వేలు ఆర్థికసాయంగా అందించారు. కార్యదర్శి జ్యోతి, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.